# స్వయంకల్పితాలు

"ఇంత చదువుకున్నావ్! ఇంత విజ్ఞానం సంపాదించావ్! మీ అమ్మ నలా క్షోభ పెట్టటం బావుందా విజయా?" కమల కంఠ స్వరంలో మందలింపుకంటే అనునయమే ఎక్కువగా వినిపిస్తోంది.

గుప్పిళ్ళతో యిసుక కుప్పలుగా పోస్తున్న విజయ తలెత్తి చూచింది. అందంగా వుండే కమల అరుణ సంధ్యలో మరింత అందంగా కనిపిస్తోంది. మరో సమయంలో అయితే "నువ్వెంత బాగుంటావే కమలా! ప్రపంచంలో అందాన్నంతా నీలో రాశిపోశాడేమో దేవుడు!" అంటూ వర్ణించడం మొదలెట్టేదేమో విజయ. కాని ఈ రోజు ఆమె ఆ పరిస్థితిలో లేదు.

"ఇంతకూ నీ వుద్దేశ్యమేమిటో చెప్పు!" కమల మళ్ళీ అడిగింది.

విజయ నిట్టూర్చింది. "ఏమని చెప్పను? నీకు తెలియంది ఏముంది కమలా? మూర్తిని తప్ప మరొకర్ని పెళ్ళాడ్డం ఇష్టంలేక ఆరేళ్లు కనిపెట్టుకుని వున్నాను. తీరా అతను మరో అమ్మాయిని చేసుకున్నాడు. ఇక జీవితంలో ఎవర్నీ వివాహం

చేసుకోదల్చుకోలేదు.'' విజయ తన కళ్ళలో నీళ్ళు కనిపించ కుండా తలొంచుకుంది.

కమలకు ఉదయం పార్వతమ్మ గారి మాటలు గుర్తు కొచ్చాయి. ఆ మాటల్లో ఎంత ఆవేదన ఉండి ఉంది ? కూతురు జీవితం ఏమై పోతుందోననే బాధ ఎంత స్పష్టంగా తెలిసింది ? అసలు గుమ్మంలో అడుగెట్టంగానే, ఎదురొచ్చిన పార్వతమ్మను చూచి నిశ్చేష్టురాలైంది కమల. అంతవయసులోనూ, పచ్చగా, బొద్దుగా కళ కళ లాడ్తుండే ఆమె నీరసించి నల్లగా కరడుగట్టి నట్లుగా వుందీనాడు. కదిలిస్తే దుఃఖం పుప్పెనలా వచ్చేలా వుంది.

గొంతు బాగా తగ్గించి అంది పార్వతమ్మగారు.

"చూడమ్మాయ్ కమలా. మనలోమాట ! విజయ కేమన్నా వయస్సు తక్కువా ? ఇప్పటికప్పుడే ఇరవై ఐదేళ్లు నిండాయి. వాడెవడో తనను చేసుకోనన్నాడని పెళ్ళొద్దని భీష్మించుక కూర్చుంటే, ఇక యీ జన్మకు పెళ్లవుతుందా ? నా ప్రాణం కాస్తా పోయినాక దానికిక దిక్కెవరు ?'' పార్వ తమ్మగారి కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి.

"ఊరుకోండి పిన్నిగారూ ? ఎలాగో సమాధాన పర్చటానికి నేనూ ప్రయత్నిస్తాను'' అంది కమల ఆమెను ఓదార్చుతూ.

పార్వతమ్మ కన్నీళ్లు తుడుచుకుని అంది. "నాకు తెలు సమ్మా ! ఎంతయినా ప్రాణస్నేహితురాలివి. నీ మాట కాదన

లేదు. అందుకే నీకు ఉత్తరం వ్రాశాను !'' ఆమె కంఠంలో సంతోషం వ్యక్తమయింది.

సాయంకాలం కాగానే విజయతో, ఏకాంతంగా వుంటే బాగుంటుందని, వూరిబయట యేటివొడ్డుకు వచ్చింది తను. ఆ తల్లి హృదయం ఎంత క్షోభిస్తుందో యీ విజయ ప్రవర్తనకు!

ఆలోచన చాలించి విజయవైపు చూచింది కమల.

"మీ అమ్మ సంగతేమిటి చెప్పు విజయా? పెద్ద వయస్సులో ఆనిడ నీ గురించి అస్తమానం బాధ పడాల్సిందేనా ?''

"ఇన్నాళ్లూ మనస్సులో ఒకరిని నిలబెట్టుకుని, ఈ రోజు మరొకర్ని కట్టుకొని ఏం సుఖపడ్తాను కమలా?'' విజయ కాస్త కోపంగా అడిగింది.

"అదేపొరపాటు. ఒక్కొక్కసారి వూహాల తోనే మనం ఏవేవో సిద్ధాంతాలు చేసుకుంటుంటాం. అవన్నీ నిజాలని, మన జీవితంతో అవి ముడిపడకపోతే, ఇక జీవితమే శూన్యమని వాపోతూంటాము కూడాను——'' ఏదో ఆలోచిస్తున్నట్లుగా చెప్పబోతోన్న కమల మాటలకు అడ్డొచ్చింది విజయ.

"ఏమిటి కమలా యీ ఉపోద్ఘాతం!"

కమల చిరునవ్వు నవ్వింది. "నా ఉద్దేశ్యంలో అసలీ ప్రేమ అనే మాటకు అర్థమే లేదు. అంతా స్వయం కల్పితం. బావ నన్ను కాదని తన క్లాస్ మేటు అరుణను పెళ్లాడతానంటూ వ్రాసిన జాబు చూచుకుని నేనూ, ఇలాగే ఒక్కసారి క్రుంగిపోయాను. ప్రపంచమే తల్లక్రిందులైనట్లు దనిపించింది.

చివరకు బ్రతుకంటే విరక్తితో ఆత్మహత్యకూడా వెనుదీయ లేదు. కమల గతంలోకి జారిపోయి, అప్పటి అనుభూతిని పొందుతున్నట్లుగా వుంది.

విజయ ఆశ్చర్యపోయింది. వెంటనే తేరుకుని, "నీ కో బావ ఉన్నట్లు ఎప్పుడూ నాతో చెప్పలేదే?" అంది. ఆమెకు, కమల తన దగ్గరకూడా కొన్ని విషయాలు దాస్తుందనే సంగతి మొదటిసారిగా తెలిసింది.

"అవును. ఎప్పుడూ చెప్పలేదు. కొన్ని విషయాలు ఎంత సన్నిహితులైనా చెప్పటానికి సంకోచం వేస్తుంది. ఈ రో జెందుకో నిన్ను చూస్తుంటే, నా పాత సంగతులన్నీ జ్ఞాపకం వస్తున్నాయి."

కొద్దికొద్దిగా చీకటిపడ్తోంది. షికారుకు వచ్చిన మనుషు లంతా బాగా కబుర్లలోకి దిగారు. సవ్వడి లేకుండా సన్నగా పారుతోంది ఏరు.

"చిన్నప్పట్నుంచీ నాకు బావంటే ఎంతో యిష్టం. అలాగే బావకూను. నేను హైస్కూలు చదువు పూర్తి చెయ్యా గానే మా ఇద్దరికి పెళ్ళి చేద్దామనుకున్నారు మా అమ్మా, నాన్నా!

నా స్కూలుఫైనలు రిజల్ట్సు రాగానే, అదేమాట మామయ్యకు రాశారు. కాని మామయ్యా ఒప్పుకోలేదు. పెళ్ళి చేస్తే బావ చదువు పాడవుతుందనీ, చదువు పూర్తి అయ్యాక చేస్తే బావుంటుందనీ జవాబు వ్రాశాడు. నాన్న నన్ను కాలే జీలో చేర్చారు. నా చదువు పూర్తయింది. బావ డాక్టరు

డిగ్రీ పుచ్చుకున్నాడు. వెంటనే నాన్నగారు మళ్ళీ జాబు వ్రాశారు, ముహూర్తం పెట్టిద్దామంటూ.

వారం రోజుల తర్వాత మామయ్యా దగ్గర్నుంచి జవాబు వచ్చింది. నాన్న మొదటిసారి ఉత్తరం వ్రాసినప్పుడే ఒప్పు కోక పోవటం తన తెలివితక్కువేననీ, ఇప్పుడు బావ తన మాట వినటం లేదనీ, అతనిని ఒప్పించలేక పోయినందుకు తనను క్షమించమనీ ఏమేమిటో వ్రాశాడు. జాబు చదివి నాన్న అగ్గయిపోయాడు. అమ్మ ఒకటే ఏడుపు. నా సంగతి సరేసరి. మర్నాడు బావ దగ్గర్నుంచి నాకో ఉత్తరం వచ్చింది.

'నిన్ను మోసగించానని తిడతావేమో! ఏం చెయ్యను? వ్రాయక తప్పటం లేదు. అసలు మొదట్లోనే నీ మీద నా 'కలాటి' భావం లేదని చెప్పాల్సింది నేను. అలా చెప్పలేక నీలో లేనిపోని ఆశలు రేకెత్తించానేమో! పొరపాటు జరిగింది. నన్ను క్షమించు— నేను మా క్లాస్‌మేట్ అరుణను పెళ్ళాడ్తాను.'

ఇలా సాగిపోయిందా ఉత్తరం. అప్పుడు నా హృద యంలో చెలరేగిన భావాలు మాటల్తో నే చెప్పలేను. రోజులు గడిచే కొద్దీ నాలో నిస్పృహ ఎక్కువ కావటం మొదలెట్టింది. ఎక్కడో ఒంటరిగా కూర్చోటం, బావనూ, బావ మోసాన్నీ, నా దురదృష్టాన్నీ గురించి ఆలోచిస్తూ కుమిలిపోవటం పరిపాటైపోయింది. అమ్మా, నాన్నా ఎన్నో సంబంధాలు తెచ్చారు. పెళ్ళిచేస్తామని యెంతగానో నచ్చచెప్పారు. నాకవేమీ చెవి కెక్కలేదు. ఇలాగే ఆజన్మాంతం కన్యగా వుండా

మనుకున్నాను. అది బావ మీద కోపమో, నా 'భగ్నప్రేమ' మీద బాధో నాకు తెలీదు. కానీ అలా ఉండిపోవటంలో కొంత శాంతి లభిస్తుందని వూహించాను. రాను రాను ఒంటరి తనం భరించలేనంతటి అశాంతి ప్రారంభమైంది. ఉద్యోగంలో చేరాను. ఏం లాభం? అనుక్షణం ఆలోచనలతో, ఆవేదనతో బుర్ర చెడిపోతుందేమో ననిపించేది". కమల చెప్పటం ఆపింది. "బాగా చీకటి పడింది ఇక లేద్దామా?" అంది హఠాత్తుగా నిల్చుంటూ! ఆమె గొంతు బాగా బొంగురుపోనయిట్టు స్పష్టం తెలుస్తూంది.

విజయ లేచి నిల్చుంది. లోపలి కుతూహలం ఆ ఫోటో లేకపోయింది.

"మరి మధు నెలా పెళ్ళాడావ్?" అంది.

ఇద్దరూ నడుస్తున్నారు. "బావ పెళ్ళయిన రెండేళ్ళకు తర్వాత తిరుపతి వెళ్తూ మా యింట్లో దిగారు. బావ అసలేమీ ఎరగనట్లే ప్రవర్తించాడు. అరుణతో ఎంతో ప్రేమగా ఉన్నాడు. నా శరీరమంతా మండినట్లనిపించింది. నన్ను నిరాకరించాడు. తను ఎంతో సుఖపడుతున్నాడు. నా కోసం అమ్మా నాన్నా అహర్నిశలూ బాధపడుతున్నారు. ఆ కృతఘ్నుడి మీద లేనిపోని ఆశలు పెట్టుకున్నందుకు నన్ను నేనే నిందించుకున్నాను. ఇలా ఒంటరిగా, అశాంతిగా కన్నవాళ్ళను దుఃఖ పెడుతూ జీవితాంతం నేను సాధించేదేముంది? నేనూ లక్షణంగా అమ్మా, నాన్నా కుదిర్చిన సంబంధంచేసుక సుఖపడ్తాను. బావ

మీద ద్వేషంతో నే నా నిర్ణయం చేసుకున్నాను. ఫలితం మధూతో నా పెళ్ళి !"

"మరి మనస్సెలా సర్దుకోగలిగావ్ ?" విజయ గబుక్కున అడిగింది. మధ్యలో కమల పెద్దగా నవ్వింది. "మనస్సు! మనం చెప్పినట్లుగా వినేట్లు మనస్సును అదుపులో పెట్టుకోటంలోనే వుంది గొప్పతనం. అంతేకాదు విజయా ! పెళ్ళయిన కొత్తలో కంనేనూ ఎలా సంసారయాత్ర సాగిస్తానా ? అనే భయంతో గిల కాబో ‌లాడిపోయాను. రోజులు గడిచేకొలది దాంపత్య జీవితం ఎ మాధుర్యం, భర్త అనురాగంలోని ఆనందమూ అర్థం కారణం ం మొదలెట్టాయి. అలాటి మధుర జీవితాన్ని చే జేతులా జిల్లాలో వేసుకుని, భగ్న ప్రేమ అంటూ శోకగీతా లాలపిస్తూ ప్రయ హారోచ్చవాలని నేను ముందు చేసుకున్న నిర్ణయం ఎంత తెలివి ఆ తక్కువదో అర్థమయింది. ఇప్పుడు చూడు. నాకు వారితోనే లోకం. బావ కలలోకి కూడా రాడు. ఒకవేళ వెనకటివన్నీ జ్ఞాపకం వచ్చినా, నాలో ఎలాటి ఉద్రేకమూ కలగదు సరిగదా, అప్పటి నా ఆలోచనలకు, సిద్ధాంతాలకు నాకే నవ్వు వస్తుంది కూడా..." కమల చెప్పటం ఆపింది.

ఇల్లు వచ్చింది. "అదుగో మీ అమ్మ పాపం ఎదురు చూస్తోంది !"

వాకిట్లో నిలబడి వీధివేపు చూస్తున్న పార్వతమ్మ శోక దేవతలా కన్పించింది విజయకు. ఆమె మనస్సు జాలితో, ప్రేమతో నిండిపోయింది.

నెల రోజుల తర్వాత, కమలకు విజయ పెళ్ళి శుభలేఖ వచ్చింది. వరుడు ఇంజనీరు శేఖరం.

రెండేళ్ళ తర్వాత, విజయ, శేఖరం వచ్చారు కమల, మధుల దగ్గరకి. కుశలప్రశ్నలూ, పరిచయాలూ, హాస్యాలూ, తమాషాగా గడిచిపోయాయి రెండురోజులు.

రాత్రి ట్రెయిన్‌కు వెళ్ళిపోతారనగా, సాయంత్రం విజయ అడిగింది కమలను, "మీ బావ ఫోటో లేదుటే కమలా మీ యింట్లో? నా కతన్ని చూడాలని భలే ఇదిగావుంది" అంటూ.

"ఓ చూపిస్తాను." కమల పక్కగదిలోకి వెళ్ళి ఫోటో పట్టుకువచ్చింది.

"ఇదేమిటి?"

"మా బావ ఫోటో! పెళ్లయిన ఇరవై ఏళ్ళ తర్వాత మా దూరపు అత్తయ్య ఒకావిడకు లేక లేక పుట్టిన కొడుకు..." కమల నవ్వుతోంది.

"మరి ఆరోజు నువ్వు చెప్పిన బావ?' అర్థంకాక అడిగింది విజయ."

"అతను నా ఊహాలలో పుట్టిన బావ. అతన్నే సృష్టించలేకపోతే, నిన్నసలు ఇలా చూడగలిగేదాన్ని కాదు" కమల గలగల నవ్వుతోంది.

నవ్వుతున్న కమల ఆమె మనస్సులాగా, మరింత అందంగా కన్పించింది విజయ కళ్ళకు.